క్లుప్తంగా

శ్మశానవాటికలో చిల్లర దొంగలు



షెడ్డుపై వాటర్ ట్యాంకు మాయం చేసిన దొంగలు

తగరపువలస: చిట్టివలస శ్మశానవాటికలో చిల్లర దొంగలు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఇటీవల దివీస్ లేబరేటరీ సీఎస్ఆర్ కార్యక్రమాల్లో భాగంగా ఇక్కడ వసతులు ఏర్పాటు చేసింది. శ్మశానవాటికకు వచ్చేవారి అవసరాల నిమిత్తం బోరుబావి నిర్మించి మోటారు, వాటర్ ట్యాంక్, స్విచ్ బోర్డు ఏర్పాటు చేసింది. చిల్లర దొంగలు షెడ్డుపై నుంచి వాటర్ ట్యాంకును, స్విచ్‌బోర్డు, వైరింగ్ పైపులను పట్టుకుపోయారు. అంతేకాకుండా శ్మశానవాటికను మందుబాబులు తమ అడ్డాగా మార్చుకున్నారు. చీకటి పడితే రహదారిపై రాకపోకలు సాగించే వారిపై దాడులకు దిగుతున్నారు. భీమిలి పోలీసులు వీరిపై నిఘా ఉంచి వీరి ఆగడాలను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

వరి నారుకు కార్బో ఫ్యూరాన్ గుళికలు వేయాలి



అనంతవరంలో జీలుగను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

పద్మనాభం: వరి నారుకు కార్బో ఫ్యూరాన్ 3 జీ వాసన రాని గుళికలు వేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె. అప్పలస్వామి సూచించారు. మండలంలోని అనంతవరం, గంధవరం, పాండ్రంగి గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించి వరి నారు, జీలుగ పచ్చిరొట్ట పైరును పరిశీలించారు. ఈ సందర్భంగా అప్పలస్వామి మాట్లాడుతూ వరి నారు వారం రోజుల్లో తీస్తారనగా ఐదు సెంట్ల విస్తీర్ణంలో గల నారు మడికి ఎనిమిది వందల కార్బో ఫ్యూరాన్ వాసర రాని 3జీ గుళికలు వేయాలన్నారు. గుళికలు వేయడం వల్ల ఊబాలు వేసిన 30 రోజుల వరకు చీడ పీడలు ఆశించ వన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయ శాఖ అధికారి ఎంపీఎస్ చలం పాల్గొన్నారు.

వేములవలసలో పందుల స్వైరవిహారం

తగరపువలస: ఆనందపురం మండలం వేములవలసలో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. ఇక్కడి పువ్వుల మార్కెట్‌ను ఆనుకుని కూడలికి అవతల పెందుర్తి మార్గంలో స్థానిక మాంస వ్యాపారులు కోళ్ల వ్యర్థాలు పారబోస్తుండటంతో పందులు ఈ ప్రాంతాన్ని స్థావరంగా ఏర్పాటు చేసుకున్నాయి. దీంతో ఈ ప్రాంతమంతా దుర్గంధంతో గుప్పు మంటోంది. వేములవలస మార్కెట్‌కు దూర ప్రాంతాల నుంచి పూల, కూరగాయల రైతులు అర్ధరాత్రి నుంచే వస్తుంటారు. విశాఖ చుట్టు పక్కల ప్రాంతాల నుంచి చిరు వ్యాపారులు, వినియోగదారులతో మార్కెట్ ఉదయం 11 గంటల వరకు రద్దీగా ఉంటుంది. వీరంతా ముక్కు మూసుకుని మార్కెట్ పరిసరాలలో క్రయవిక్రయాలు సాగిస్తుంటారు. ప్రయాణికులు కూడా ఇక్కడి దుర్గంధాన్ని భరించలేక బస్సుల కోసం దూరంగా వేచి ఉండవలసి వస్తుంది. జిల్లాలో ప్రముఖ వ్యాపార కేంద్రంగా విలసిల్లుతున్న వేములవలసను ఇక్కడి పందుల స్థావరం దిగజారుస్తోంది. ప్రాణాంతకమైన వ్యాధులు చుట్టుముట్టక ముందే వేములవలస కూడలిలో అధికారులు రక్షణ చర్యలు చేపట్టాలని వ్యాపారులు, రైతులు, ప్రయాణికులు కోరుతున్నారు.

రైతులకు పరామర్శ

తగరపువలస: ఇటీవల వర్షాల కారణంగా ఆనందపురం మండలంలో నష్టపోయిన కూరగాయల రైతులను బీజేపీ నాయకులు శనివారం పరామర్శించి పంట నష్టం గురించి తెలుసుకున్నారు. లొడగలవానిపాలెం, నేలతేరు గ్రామాలలో నువ్వులు, మిరప, చిక్కుడు తదితర పంటలు నష్టపోయినట్టు నాయకులు గుర్తించారు. వీరిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. రైతులను పరామర్శించిన వారిలో పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఉప్పాడ అప్పారావు, పీవీవీ ప్రసాదరావు తదితరులు ఉన్నారు.



పరదేశిపాలెం గెడ్డపై ప్రవహిస్తున్న వరద నీరు



రుషికొండ వద్ద ముందుకు వచ్చిన సముద్రం

తగ్గని వరద ఉధృతి

- పరదేశిపాలెం వైపు రాకపోకలు బంద్
- మూడు రోజులుగా వేటకు వెళ్లని మత్స్యకారులు
- ముందుకొచ్చిన రుషికొండ బీచ్

కొమ్మాది: మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు జీవీఎంసీ 4వ వార్డు పరదేశిపాలెం గెడ్డ వద్ద వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. శనివారం వర్షం తగ్గినప్పటికి వరద ఉధృతి మాత్రం తగ్గలేదు. దీనితో శనివారం కూడా ఈ ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. రుషికొండ వద్ద బీచ్ ముందుకు వచ్చింది. దీంతో పర్యాటకులను లైఫ్‌గార్డ్స్, మెరైన్ పోలీసులు అప్రమత్తం చేశారు. తీర ప్రాంతాలైన మంగమారిపేట, తిమ్మాపురం, ఉప్పాడ, భీమిలి ప్రాంత మత్స్యకారులు వేటను నిలిపివేశారు. మూడు రోజుల నుంచి వర్షాలు కారణంగా వేటకు వెళ్లలేని తమను కనీసం కూటమి నాయకులు పట్టించుకోలేదని తీర ప్రాంతాలకు ఆనుకుని ఉన్న మంగమారిపేట, ఉప్పాడ మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో తుఫాను సమయంలో ముందుగానే అధికారులతో మత్స్యకారులను అప్రమత్తం చేసి, తుపాను రక్షిత భవనాలకు తరలించే వారని, అయితే నేడు కనీసం పట్టించుకునే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

కూలిపోయేందుకు సిద్ధంగా ప్రహరీ

తగరపువలస: వందేళ్లపై చరిత్ర కలిగిన చిట్టివలస జ్యూట్‌మిల్లు ప్రహరీ ఇటీవల వర్షాలకు ప్రమాదకరంగా మారింది.2009లో మిల్లు లాకౌట్‌కు గురైన తరువాత 11 ఏళ్లకు యాజమాన్యం ఆస్తులను విక్రయించి గోదాములను కూల్చి యంత్రాలను తుక్కుగా విక్రయించింది. భవనాలను నేలమట్టం చేసి ప్రహరీని మాత్రమే వదిలేసింది. మిల్లు మూత కారణంగా నిర్వహణ లేక ప్రహరీలో చెట్లు మొలిచి బీటలు వారింది. ఇటీవల వర్షాలకు శిథిలమైన ప్రహరీ అక్కడక్కడా కూలిపోయింది. ఈ రహదారి మీదుగా నిత్యం వివిధ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు, పలు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఆ సమయంలో ప్రహరీ ఎవరిపైనైనా పడితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించి ప్రహరీని తొలగించాలని పలువురు కోరుతున్నారు.



వర్షాలకు కూలిన ప్రహరీ

యువతి అదృశ్యంపై కేసు

పీఎం పాలెం: యువతి అదృశ్యంపై పీఎంపాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ వై. రామకృష్ణ తెలిపిన వదివరాలు ఇలా ఉన్నాయి. మధురవాడ సంజనా లే అవుట్‌లోని సంజనా రెసిడెన్సీలో ఎస్.రామకృష్ణ కుటుంబంతో నివసిస్తున్నాడు. ఆయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ నెల 19వ తేదీ కళాభారతిలో జరిగిన ఓ కార్యక్రమానికి రామకృష్ణ కొడుకు, కుమార్తెలను తీసుకు వెళ్లాడు. అనంతరం అదే రోజు రాత్రి 12 గంటలకు ఇంటికి చేరుకున్నారు. మరుసటి రోజు సాయంత్రం 5 గంటలనుంచి కూతురు ఇంట్లో కనిపించలేదు. చుట్టుపట్ల గాలించినా కుమార్తె ఆచూకీ లభించక పోవడంతో యువతి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ర్యాంకర్ అవినాష్‌కు సత్కారం



అవినాష్‌ను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

పీఎం పాలెం: జూన్ 27న విడుదలైన పీజీ కోర్సు ప్రవేశ పరీక్ష (ఏపీపీజీసెట్ 2024)లో రాష్ట్రస్థాయిలో 9వ ర్యాంకు సాధించిన స్థానిక బాబా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ విభాగం విద్యార్థి వీకే అవినాష్‌ను శనివారం కళాశాల ప్రాంగణంలో ఘనంగా సత్కరించారు. కళాశాల కరస్పాండెంట్ కె.శ్రీలక్ష్మి ఈ సందర్భగా మాట్లాడుతూ ర్యాంకు సాధించిన అవినాష్‌ను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు భవిష్యత్‌కు పునాదులు వేసుకోవాలలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.పూర్ణ సత్యనారాయణ పాల్గొన్నారు.

బొప్పాయికి అగ్గితెగులు

తగరపువలస: ఆనందపురం మండలంలో బొప్పాయి పంటను అగ్గి తెగులు ఆశించింది. దీంతో పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపించి రైతులు నష్టపోతున్నారు. రూ.లక్షలలో పెట్టుబడి, ఫలనకాలం , కుటుంబాలతో కాయకష్టం వృథాగా పోయినట్టేనని రైతులు లబోదిబోమంటున్నారు. మండలంలో లొడగలవానిపాలేనికి చెందిన తండ్రీకొడుకులు నమ్మి రామారావు, వెంకటరావు ఏడాది కాలంగా బొప్పాయి పంటపై పెట్టిన కష్టం అగ్గితెగులు రూపంలో కబలించుకుపోయింది. ఈ ఏడాది వీళ్ల తమకున్న ఎకరంన్నర భూమిలో రూ.3 లక్షలు పెట్టుబడి పెట్టి బొప్పాయి సాగు చేపట్టారు. మొక్కను రూ.20 మొదలుకుని కొనుగోలు చేసి సస్యరక్షణ చేపట్టారు. రెండు నెలల్లో మొదటి కోత తరువాత అగ్గితెగులు పంట దిగుబడిని అమాంతం మింగేసింది. దీంతో ఆకులు ముడుచుకుపోయి నల్లటి బూడిద పేరుకుపోవడం వంటి లక్షణాలు కనిపించాయి. క్రమేణా దిగుబడి పడిపోవడంతో ఏడాది కాలంగా పంటపై తాము పెట్టుకున్న ఆశలు అడియాసలు అయ్యాయని వాపోయారు. తమలాగే మండలంలో అనేక మంది రైతులు బొప్పాయి సాగు చేసి అగ్గితెగులు కారణంగా నష్టపోయారన్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బొప్పాయి రైతులు కోరుతున్నారు.



అగ్గితెగులు కారణంగా పంట నష్టపోయిన రైతులు రామారావు, వెంకటరావు

క్షయ సిబ్బందిని రెగ్యులర్ చెయ్యాలని వినతి

మధురవాడ: ఎన్‌టీఈపీలో పనిచేస్తున్న క్షయ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు నేషనల్ హెల్త్ మిషన్ పని చేస్తున్న జిల్లా క్షయ నివార ణా విభాగం యూనియన్ జిల్లా సెక్రటరీ వీర బ్రహ్మం, నాయకులు సురేష్, అరుణ్‌కుమార్ తదితరులు శనివారం మధురవాడలో వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో సుమారు 30మంది క్షయ విభాగంలో 21 ఏళ్లుగా పనిచేస్తున్నారని తెలిపారు. డీఎంహెచ్‌వో కాంట్రాక్ట్ ట్యాబ్ టెక్నీషియన్‌కు రూ32,670, క్షయ నివారణా విభాగంలో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్‌కు రూ.23,394 జీతం ఇస్తున్నారని, ఇందులోనూ కూడా భారీగా వ్యత్యాసం ఉందన్నారు. ఒక్కో ఉద్యోగి ఏడాదికి రు.20,000 వరకు నష్టపోతున్నారన్నారు. దీనిపై తక్షణ చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు.

హుద్‌హుద్ ఇళ్లకు తాళాలు

- బక్కన్నపాలెంలో బాధిత రైతుల ఆందోళన

మధురవాడ: బక్కన్నపాలెంలో నవోదయ వద్ద హుద్‌హుద్ కాలనీ, పోలీసు బెటాలియన్ తదితర సంస్థల నిర్మాణం తమ నుంచి భూములు తీసుకుని పరిహారం ఇంతవరకు చెల్లించకపోవడంతో బాధిత రైతులు ఆందోళన నిర్వహించారు. సీపీఎం నేతల ఆధ్వర్యంలో కొమ్మాది, బక్కన్నపాలెం, రేవళ్లపాలెంలకు చెందిన రైతులు హుద్‌హుద్ ఇళ్లకు తాళాలు వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు అప్పలరాజు మాట్లాడుతూ రైతులు పట్ల ఏపీ హౌసింగ్ కార్పొరేషన్, రెవెన్యు అధికారులు వ్యవహరిస్తున్న నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా నిరసన చేపట్టినట్టు చెప్పారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదన్నారు. ఇక్కడ రైతులకు ఇళ్లు ఇవ్వకుండా వేరే వాళ్లకి కేటాయించారని ఇది అన్యాయమన్నారు. ఇప్పటికైనా బాధిత రైతులకు న్యాయం చేయాలని కోరారు. వీరికి న్యాయం జరిగే వరకూ పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రైతులు పోతురాజు, ఎన్. పైడిరాజు, కేవీపీఎస్ నాయకులు సియాద్రి పైడితల్లి, కె. నాగరాజు, ఎస్. అక్కయ్యమ్మ, అప్పారావు, కనకరాజు, వెంకటప్పారావు తదితరులు పాల్గొన్నారు.



బక్కన్నపాలెం హుద్‌హుద్ కాలనీ ఇళ్లకు తాళాలు వేసి నిరసన తెలుతున్న బాధిత రైతులు

ఏయూలో లింగ సమానత్వంపై జాతీయ వర్క్‌షాప్

ఎంవీపీకాలనీ: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో లింగం, సమానత్వం, ప్రజాస్వామ్య రూపురేఖలు అంశంపై జాతీయ వర్క్‌షాప్ నిర్వహించారు. ఏయూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చైర్ ఆధ్వర్యంలో శనివారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య నరసింహారావుతో పాటు న్యాయ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సీతామాణిక్యం పాల్గొని లింగ సమానత్వం ప్రజాస్వామ్య సమాజంలో ఎంత ముఖ్యమైనదో వివరించారు. లింగ సమానత్వం చారిత్రాత్మక ప్రముఖ్యత, ప్రజాస్వామ్య సిద్ధాంతాలపై వ్యక్తలు చర్చించారు. అనంతం వర్కుషాపు కన్వీనర్, ఏయూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ రచించిన 'ఎంపవరింగ్ ఉమెన్ ఫర్ ఏ సస్టైయినబుల్ ఫ్యూచర్' పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. లింగ సమానత్వం, స్థిరత్వం సాధన కోసం వ్యూహాలను ఈ పుస్తకం వివరిస్తుందని ఆచార్య జేమ్స్ స్టీఫెన్ వెల్లడించారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో ఈ వర్కుషాపును నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి.వినోద్‌కుమార్, డాక్టర్ దివాకర్ వాడపల్లి, డాక్టర్ సీహెచ్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

భవనం పైనుంచి పడి మేస్త్రి మృతి

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డు విశాలాక్షినగర్‌లో జరుగుతున్న భవన నిర్మాణ పనుల్లో ప్రమాదవశాత్తు లేబర్ మేస్త్రీ రౌతు పాపారావు(45) మృతి చెందాడు. ఆరిలోవ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా.. విశాలాక్షినగర్‌లో ఓ వ్యక్తి భవన నిర్మాణం చేపడుతున్నాడు. ఇందులో భాగంగా శనివారం లిఫ్ట్ ఏర్పాటు పనులు చేపట్టారు. లిఫ్ట్ అమర్చే క్రమంలో భవనం రెండో ఫ్లోర్‌లో ఉండగా.. దాని అడుగు భాగం తొట్టి లేబర్ మేస్త్రీ రౌతు పాపారావుపై జారిపడింది. దానితోపాటు కిందపడిన మేస్త్రీ తలకు తీవ్రగాయాలై మెడ భాగం కొంత కోసుకుపోవడంతో ప్రాణాలు కోల్పోయాడు. ఆరిలోవ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పాపారావు మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బతుకుతెరువు కోసం వచ్చి..

రౌతు పాపారావుది విజయనగరం జిల్లా మెంటాడ మండలం పోరాం గ్రామం. అక్కడ నుంచి కొన్నేళ్ల కిందట బతుకుతెరువు కోసం విశాఖపట్నం వచ్చి 10వ వార్డు రవీంద్రనగర్‌లో కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. అతడికి భార్య గౌరి, ఇద్దరు పిల్లలున్నారు. భవన నిర్మాణ పనుల్లో లేబర్ మేస్త్రీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇద్దరు పిల్లల్లో పెళ్లీడుకొచ్చిన కుమార్తె ప్రైవేట్ ఉద్యోగం చేస్తుండగా.. కుమారుడు చదువుతున్నాడు. కుటుంబాన్ని పోషించే పాపారావు మృతి చెందడంతో అతడి భార్య, కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

విమ్స్‌లో స్టాఫ్‌నర్స్ భర్త వీరంగం

ఎంవీపీకాలనీ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (విమ్స్)లో ఇన్‌చార్జ్ స్టాఫ్‌నర్స్ భర్త శనివారం వీరంగం సృష్టించాడు. ఇన్‌చార్జ్ స్టాఫ్ నర్స్‌తో కలిసి ఆమె భర్త ఈసీజీ పరీక్ష కోసం శనివారం ఆస్పత్రికి వచ్చాడు. అయితే ఆ సమయంలో సిబ్బంది మరో మహిళకు ఈసీజీ చేస్తున్నారు. దీంతో ఈసీజీ సెంటర్ డోర్లు క్లోజ్ చేసుకున్నారు. ఇంతలో స్టాఫ్‌నర్స్‌తో కలిసి అతని భర్త తక్షణమే డోర్లు ఓపెన్ చేయాలంటూ గట్టిగా తట్టాడు. లోపల ఈసీజీ స్కాన్ జరుగుతుండటంతో సిబ్బంది డోర్లు ఓపెన్ చేయకపోవడంతో మరింత గట్టిగా కొట్టి హంగామా సృష్టించాడు. అనంతరం డోర్లు ఓపెన్ చేయడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ విరుచుపడ్డాడు. దీంతోపాటు డీఎంవీకి సైతం ఫిర్యాదు చేశాడు. దీంతో ఆ నర్సుతో పాటు ఆమె భర్త తీరుపై సిబ్బంది విమ్స్ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

అలరించనున్న 'కంచర్ల'

దాబాగార్డెన్స్ : తమ ఇంటి పేరైన కంచర్ల టైటిల్‌తో ప్రతిష్టాత్మకంగా చిత్రం నిర్మిస్తున్నామని ప్రొడ్యూసర్ కంచర్ల అచ్యుతరావు తెలిపారు. ఆగస్టులో విడుదలయ్యే ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా ఉంటుందన్నారు. శనివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. షూటింగ్ పూర్తయిందని, ఈ చిత్రం ద్వారా వచ్చే లాభాలతో ట్రస్ట్ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు.

సర్జికల్ వార్డు ప్రారంభం

మధురవాడ: నగరంలోని మధురవాడ గాయత్రి మెడికల్ టెక్నాలజీ హాస్పిటల్‌లో గ్రహణం మొర్రికి ఉచిత శస్త్ర చికిత్స అందించే ×మిషన్ స్మైల్® కార్యక్రమాన్ని, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సర్జికల్ వార్డును ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శనివారం ప్రారంభించారు. ముత్తూట్ ఫిన్ కార్పొరేషన్, గాయత్రి ఆస్పత్రుల సంయుక్తంగా దీనిని నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఆపరేషన్ల కొరకు రాష్ట్ర వ్యాప్తంగా 150మంది వరకు నమోదు చేయించుకున్నారని, ఒక్కొక్కరికి రూ.2లక్షలు వరకు ఖర్చు అవుతుందని, దీనిని ముత్తూట్ ఫిన్ కార్ప్ సీఎస్ఆర్ నిధులు నుంచి అందిస్తుందని వారు తెలిపారు. గ్రహణం మొర్రికి సంబంధించి ఆదివారం నుంచి 24వ తేదీ వరకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె. సత్యవరప్రసాద్, బోర్డ్ ఆఫ్ మిషన్ స్మైల్ ట్రస్టీ డాక్టర్ రామ్‌కుమార్ వెంకటేశ్వరన్, చీఫ్ బిజినెస్ ఆఫీసర్ బినోద్‌కోలా, డైరెక్టర్ దిలీప్ పాండే, ముత్తూట్ పాపాచాన్ గ్రూప్ సీఎస్ఆర్ హెడ్ డాక్టర్ ఎస్. ప్రశాంత్ కుమార్, గాయత్రి డీన్‌లు వెంకటరావు, పలువురు గాయత్రి ఆస్పత్రి ప్రొఫెసర్లు, వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రత్యేక సర్జికల్ వార్డులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

వర్షాకాలంలో పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలి

భీమునిపట్నం: వర్షాలు పడుతున్న నేపథ్యంలో పాడి రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పశుసంవర్థక శాఖ జిల్లా ఉప సంచాలకులు డాక్టర్ ఎం.చంద్రశేఖర్ అవగాహన కల్పించారు. శనివారం రేఖవానిపాలెం వద్ద పాడిరైతులతో సమావేశమయ్యారు. వర్షాలు కురిసే సమయంలో పిడుగులు పడే అవకాశాలు ఉండడం వల్ల పశువులను సురక్షిత ప్రాంతాల్లో ఉంచాలన్నారు. ఈ సందర్భంగా 142 పశువులకు పరీక్షించి, టీకాలు వేశారు. భీమిలి పశువైద్య సంచాలకులు డాక్టర్ బి.వెంకటరమణ, తాళ్లవలస పశువైద్యాధికారి గౌరి ప్రశాంతి, సిబ్బంది శివకృష్ణ, శ్రీనివాసరావు, శంకర్, వెంకటరావు పాల్గొన్నారు.



పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది



గిరిప్రదక్షిణ చేస్తున్న భక్తులు

సింహగిరుల్లో భక్తజన ప్రవాహం



తెన్నేటి పార్కు బీచ్ రోడ్డులో భక్తుల సందడి

ఆరిలోవ: అప్పన్న గిరి ప్రదక్షిణ భక్తులతో శనివారం బీఆర్‌టీఎస్ కిటకిటలాడింది. ఉదయం 7 గంటలకే భక్తులు నడక ప్రారంభించారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్క చేయకుండా సింహాద్రి అప్పన్నపై తమ భక్తి చాటుకోవడానికి సిద్ధమయ్యారు. గొడుగులు చేతబట్టి ప్రదక్షిణ ప్రారంభించారు. ఉదయం వర్షం తగ్గడంతో ఊపిరి పీల్చుకొన్నారు. స్వామి నామస్మరణతో అప్పన్నకొండను అవలీలగా చుట్టేశారు. భక్తుల తాకిడితో బీఆర్‌టీఎస్ రోడ్డులో అన్ని లైన్‌లు అడవివరం నుంచి హనుమంతవాక సందడిగా మారాయి. హనుమంతవాక నుంచి విశాలాక్షినగర్ మీదుగా జోడుగుళ్లపాలెం, తెన్నేటి పార్కు, అప్పుఘర్ వరకు బీచ్‌రోడ్డు, అక్కడ నుంచి ఎంవీపీ కాలనీ, వెంకోజీపాలెం, హెచ్‌బీ కాలనీ మీదుగా సింహాచలం వరకు భక్తులు నడక సాగించారు. వయసుతో సంబంధం లేకుండా వృద్ధులు, పిల్లలు, యువకులు ప్రదక్షిణలో పాల్గొన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటలు వరకు భక్తులు రోడ్లపై పలచగా కనిపించినా ఆ తర్వాత నుంచి రోడ్లు కిటకిటలాడాయి. గొడుగులు వేసుకొన్న భక్తుల మధ్యలో వాహనాలు వెళ్లడానికి వీలులేని పరిస్థితి ఏర్పడింది. అడవివరం నుంచి హనుమంతవాక మీదుగా జోడుగుళ్లపాలెం వరకు ఎక్కడ చూసినా గిరి ప్రదక్షిణ భక్తుల సందడే కనిపించింది. దారిపొడవునా స్వచ్ఛంద సంస్థలు అందించిన ప్రసాదం స్వీకరిస్తూ భక్తులు ఆకలి తీర్చుకొన్నారు. లక్షలాదిమంది భక్తులు తరలిరావడంతో రోడ్లన్నీ రద్దీగా మారాయి. జిల్లా కలెక్టర్, జీవీఎంసీ అధికారులు, నగర పోలీస్ కమిషనర్, డీసీపీలు, ఏసీపీలు నిరంతరం పర్యవేక్షణలో భక్తులకు ఇబ్బంది కలగకుండా సిబ్బంది చర్యలు తీసుకున్నారు.

స్వచ్ఛంద సంఘాల ప్రసాద వితరణ : భక్తులు ఆకలి తీర్చడానికి దాతలు ముందుకొచ్చారు. జీవీఎంసీ, సింహాచలం దేవస్థానం అధికారులు పలుచోట్ల తాగునీరు, మందులు, సరఫరా చేశారు. పైనాపిల్‌కాలనీ నుంచి జోడుగుళ్లపాలెం వరకు పలు స్వచ్ఛంద సేవా సంస్థలు, గ్రామ సంఘాలు, వివిధ ఆలయాల నిర్వాహకులు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదం , పులిహోరా, మంచినీరు, మజ్జిగ, టీ, చక్కెర పొంగలి, శనగలు, బూరెలు, బజ్జీలు పంపిణీ చేశారు. స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసిన పలు ప్రసాద వితరణ కేంద్రాలలో నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, వార్డుల కార్పొరేటర్లు ఆయా ప్రాంతాలలో పాల్గొని భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. విశాఖ కేంద్ర కారాగారం వద్ద జైల్, ఏపీఎస్పీ బెటాలియన్ సిబ్బంది సంయుక్తంగా స్టాల్ నిర్వహించారు. ఇక్కడ పులిహోరా, శనగలు, బిరియాని, టీ , తాగునీరు సరఫరా చేశారు. ముడసర్లోవ వద్ద మామిడి తోటలో విశ్వాస్ సంస్థ ఆధ్వర్యంలో భక్తులకు పులిహోరా, పరమాన్నం, తాగునీరు, మందులు అందజేశారు.

ముందుకొచ్చిన సముద్రం

ఆరిలోవ: తుపాను ప్రభావంతో సముద్రం కెరటాలు ఎగిసిపడుతున్నాయి. జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సముద్రం నీరు తీరంలో మరింత ముందుకొచ్చింది. జోడుగుళ్లపాలెం, సీతకొండ సీ వ్యూ పాయింట్ వద్ద సముద్రం నీరు గతంలో కంటే ముందుకు చేరింది. ఒడ్డున విశాలమైన ఇసుక దిబ్బలు సగానికి పైగా మునిగిపోయాయి. సీతకొండ సీ వ్యూ పాయింట్ వద్ద రాళ్లకు కొంత దూరంలో ఉండే నీరు ఇప్పుడు వాటిని దాటి ముందుకు వచ్చింది. దీంతో బీచ్ లోపలకు సందర్శకులు ఎవరూ వెళ్లే సాహసం చేయకుండా రోడ్డు మీద నుంచే కెరటాలను తిలకిస్తున్నారు.